ప్రజాశక్తి
బుధవారం 23 నవంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు

మండల పరిషత్ ఎఒ హఠాన్మరణం

ఎఒ ప్రభాకర్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఒగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్(54) మంగళవారం హఠాన్మరణం పొందారు. కార్యాలయంలోనే ఉదయం టీ తాగిన అనంతరం దగ్గు, వాంతులు కావడంతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానిక సిహెచ్‌సికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గిరిజన ప్రాంతంలోనే దాదాపు పాతికేళ్లపాటు వివిధ హోదాల్లో ఉద్యోగబాధ్యతలు నిర్వహించిన ప్రభాకర్, ఇలా విధుల్లో ఉండగానే కన్నుమూయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండలంలోలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా విధులు నిర్వహించారు. ప్రభాకర్ భౌతిక కాయాన్ని పెందుర్తి పూలగానిపాలెం గ్రామంలోని అతని స్వగృహానికి ప్రత్యేక అంబులెన్స్‌లో మండల పరిషత్ సిబ్బంది, ఇతర మండలశాఖల అధికారులు తరలించే ఏర్పాట్లు చేశారు.

రూ.5.50 కోట్లతో ఎకో టూరిజం పార్కు

ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న సిఎఫ్ మధుసూదన్

ప్రజాశక్తి -అనంతగిరి : అల్లూరి జిల్లా ఏజెన్సీ అనంతగిరి కాఫీ తోటల చాపరాయి వద్ద ఏకో టూరిజం సిల్క్ పార్కు నిర్మాణానికి రూ.5.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని రాష్ట్ర అటవీశాఖ సీఎఫ్. మధుసూదనరావు అన్నారు మంగళవారం మండలంలోని ఎగువశోభ పంచాయతీ పరిధి మర్దగూడ సమీపం కాఫీ తోటల సాపరాయి వద్ద సంబంధిత స్థలాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అనంతగిరి మండలంలో పర్యాటకులకు అనుకూలంగా ఏకో టూరిజం పార్కుతోపాటు అటవీజంతువులు సిల్క్ పార్క్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఏజెన్సీలో అనేక ప్రాంతాలలో ఏకో టూరిజం పార్కుల నిర్మాణానికి పరిశీలన చేసినా, ఎక్కడా అనుకూలమైన స్థలం దొరకలేదని, చివకు అనంతగిరి మండలంలో ఏర్పాటు చేస్తామన్నారు. దీనిద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.కార్యక్రమంలో విశాఖపట్నం డిఎఫ్ఒ ఆనంద శంకర్, అల్లూరి జిల్లా సిసిఎఫ్ఒ వినోద్ కుమార్, అనంతగిరి రేంజర్ దుర్గాప్రసాద్, సెక్షన్ ఆఫీసర్ ఎన్. సీతారాం పాల్గొన్నారు

'నాడు - నేడు' పనులకు సిమెంట్ కొరత

- ఏజెన్సీలో ఎక్కడికక్కడే నిలిచిన నిర్మాణాలు
- ప్రభుత్వపరంగా సిమెంట్ సరఫరాలో జాప్యం
- అవసరమైన చర్యల్లో అధికార యంత్రాంగం విఫలం

సిమెంట్ లేక ప్రభుత్వ కళాశాలలో నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలోని పాడేరు ఏజెన్సీలో ఇటీవల చేపట్టిన నాడు నేడు రెండవ విడత పనులకు ఇసుక, సిమెంట్ కొరత ఏర్పడింది. దీంతో వారం రోజులుగా పాడేరు మన్యంలో నాడు నేడు నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 284 విద్యాలయాలకు రెండోవిడత నాడు నేడు కింద రూ.63.37 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా విద్యాసంస్థల్లోని అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర నిర్మాణలతోపాటు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. ఈ మేరకు రెండు నెలల క్రితమే నిర్మాణ పనులు మొదలయ్యాయి. అయితే ఈ నిర్మాణ పనులకు ప్రభుత్వమే సిమెంట్ సరఫరా చేస్తోంది. మరమ్మతు పనుల వరకు స్థానికంగా దొరికే ఇసుకను వినియోగిస్తున్నారు. అయితే స్లాబ్ నిర్మాణానికి, ప్లాస్టింగ్‌లకు మైదాన ప్రాంతాల నుంచి నాణ్యమైన ఇసుకను సేకరిస్తున్నారు. అయితే పాడేరు ఏజెన్సీ ప్రాంతానికి ప్రభుత్వపరంగా సరఫరా చేస్తున్న సిమెంట్‌లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇక ఇసుక కొరత కూడా నిర్మాణ పనులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అంటున్నారు. పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వపరంగా ఒత్తిడి చేస్తున్న సంబంధిత అధికారులకు నిర్మాణాలకు అవసరమైన ముడిసరుకు సిమెంట్, ఇసుక, ఇంకా పిక్కఅందుబాటులో లేక పనులు నిలిచిపోయినా, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.ఒక కోటి 27 వేలు నిధులతో 'నాడు నేడు' రెండో విడతలో మరుగుదొడ్లు, ఫ్లాట్ ఫారాలు, తరగతు గదుల మరమ్మతులు వంటి పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులన్నీ సిమెంట్ కొరతతో నిలిచిపోయాయి. మరికొన్ని పనులు సిమెంట్ సరఫరాలో జాప్యం వల్ల మందకొడిగా సాగుతున్నాయి. సిమెంట్ సరఫరాలో ఏర్పడిన జాప్యంపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించి సకాలంలో సిమెంట్ సరఫరా చేయించి పనులు వేగవంతంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని పాఠశాలల యాజమాన్యాలు కోరుతున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్రంలో పిఒ సూరజ్ గనోరే

పౌష్టికాహారం సకాలంలో అందించాలి

- కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి -రంపచోడవరం

అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులు, చిన్నపిల్లలకు ప్రతిరోజూ పౌష్టికాహారం సకాలంలో అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు చెందిన ఐసిడిఎస్ సిడిపిఒ, ఎంపిడిఒలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేతో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని గర్భిణులు, చిన్నపిల్లలకు రక్తహీనత లేకుండా మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు పరివేక్షించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం తీసుకుంటున్న గర్భిణుల బరువు, బిపి, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు.

పిల్లలు, గర్భిణులు అంగన్వాడీ కేంద్రాలకు రాలేకపోతే వారి ఇళ్లకు వెళ్లి పాలు, గుడ్లు, ఇతర పౌష్టికాహార వస్తువులను అందజేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు సకాలంలో సరుకులు చేరే విధంగా సిడిపిఓలు, తహశీల్దార్లతో కలిసి పనిచేయాలన్నారు. సిడిపిఓలు మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు పిల్లల తల్లుల ఫోన్ నెంబర్లు తీసుకొని, పిల్లలు అంగన్వాడీకి రాకపోతే వారితో పిల్లలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒక్కో అంగన్వాడీ సూపర్వైజర్ నెలకు 20 అంగన్వాడీ కేంద్రాలను తప్పకుండా పరిశీలించాలన్నారు. గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో 15 రోజులకు ఒకసారి ఎంపీడీవోలు రివ్యూ మీటింగు పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు బాపన్న దొర, ఎంవిఆర్ కుమార్ బాబు, వీర కిషోర్, చిన్న బాబు, రత్న కుమారి, సిడిపివోలు సంధ్యారాణి, ప్రసన్న, దీప్తి, లక్ష్మీ పాల్గొన్నారు.

కాఫీ ప్రోత్సాహక బకాయిలు చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ గిరిజన కాఫీ రైతుసంఘం డిమాండ్
గిట్టుబాటు ధర కల్పించాలని వినతి
పాడేరులో భారీ ర్యాలీ .. ఐటిడిఎ వద్ద ధర్నా
పది మండలాల నుంచి భారీగా వచ్చిన రైతులు

కాఫీ రైతుల ధర్నాలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత సురేంద్ర

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు ఏజెన్సీలో కాఫీ సాగు చేస్తున్న గిరిజన రైతులకు కాఫీ బోర్డు, ఐటిడిఎ ద్వారా ప్రభుత్వపరంగా చెల్లించాల్సిన నాలుగేళ్ల ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన కాఫీ రైతుసంఘం డిమాండ్ చేసింది. మంగళవారం పాడేరులో భారీ ర్యాలీ నిర్వహించి, ఐటిడిఎ వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. .ఈ సందర్భంగా గిరిజన కాఫీ రైతుల సంఘం గౌరవాధ్యక్షుడు, ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు మాట్లాడుతూ గిరిజన రైతుల పండిస్తున్న అరుకు కాఫీకి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, ఒక కప్పు కాఫీకి రూ.100 నుంచి రూ. 300లు తీసుకుంటున్నారని, రైతులు పండించే కాఫీ కిలోకు రూ.300 చెల్లించలేని దౌర్భాగ్య పరిస్థితి ఉండడం విచారకరమన్నారు. కాఫీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, సుంకరమెట్ట సర్పంచ్ గమ్మెలి చినబాబు మాట్లాడుతూ కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయిలు చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. వేసవిలో ఎండలకు కాఫీ తోటలు దగ్ధమై రైతులు నష్టపోతున్న పరిస్థితుల్లో వీటికి బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సౌలభ్యం కోసం . ప్రతి మండలంలోకాఫీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ కాఫీ సాగు ప్రోత్సాహంలో గిరిజన రైతులకు అన్యాయం జరుగుతోందని, దీనిపై రైతుల్లో నిరాశ నెలకొందన్నారు. కాఫీ రైతుల పొట్ట కొట్టొద్దని, కాఫీ ప్రగతికి అడ్డు పడొద్దని కోరారు. కాఫీకి గిట్టుబాటు ధర కల్పించకపోతే, మన్యంలో కాఫీకి భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. కాఫీ ప్రోత్సాహక బకాయిలపై అధికారులు లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఎ ఎపిఒ వెంకటేశ్వరరావుకు అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీనిచ్చారు.

గిరిజన కాఫీ రైతుల డిమాండ్లు ఇవే..

-.కాఫీ ప్రోత్సాహక బకాయి రూ. 60 కోట్లు చెల్లించాలి
- కాఫీ గింజలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.
-.ఉచితంగా కాఫీ డ్రయిండ్ యార్డులు, బేబీ పల్పింగ్ యూనిట్స్ ఇవ్వాలి.
- కాఫీ ప్రోత్సహక నిధులు ఎకరాకు రూ.50 వేలు పెంచాలి.
- కాఫీ తోటలకు ప్రమాదబీమా కల్పించాలి.
- ఎకరాకు రూ.2లక్షల వరకు వడ్డీలేని రుణం ఇవ్వాలి
- కాఫీ, మిరియాల మొక్కలు రైతులకు ఉచితంగా పంపిణీ చెయ్యాలి.
- కాఫీ సాగులో ఉన్న అటవీ భూములకు పోడు పట్టాలివ్వాలి.
- కాఫీ రైతుల పిల్లలకు స్కాలర్‌షిప్స్ వెంటనే ఇవ్వాలి.
- ఆర్గానిక్ సర్టిఫికేట్లు అందించి మార్కెటింగ్ సదుపాయలు కల్పించాలి.
- రైతులకు ఉచితంగా నిచ్చెనలు, కట్టర్లు, టార్పాలిన్లు అందించాలి
-.కాఫీ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలి.
-జిసిసి ద్వారా రుణాలు, కాఫీ, మిరియాలు కొనుగోళ్లు చేయాలి.
-పాత తోటల అభివృద్ధికి ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి.
- కాఫీ తోటలు అభివృద్ధికి నీడ మొక్కలు ఉచితంగా అందించాలి.

జల విద్యుత్ కేంద్రంలో మొరాయించిన యూనిట్లు

ప్రజాశక్తి- సీలేరు

జలవిద్యుత్ కేంద్రం యూనిట్లు

జికె.వీధి మండలం సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్లు మంగళ వారం మొరాయించాయి. మొదటి యూనిట్‌లో బైపాస్ వాల్వ్ తెరుచుకోవడంతో యూనిట్ స్టార్ట్ కాలేదు. దీంతో ఇంజినీర్లు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సాంకేతిక లోపం సరిచేసి యూనిట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చారు. రెండో యూనిట్‌లో యూజీ బేరింగ్‌లో టెంపరేచర్‌లు హెచ్చుతగ్గులు అవుతుండటంతో యూనిట్ ట్రిప్ అయింది. ఇంజినీర్ల యూనిట్‌ను నిలిపివేశారు. ఇంకా యూనిట్‌ను పరిశీలించాల్సి ఉంది.

అభివృద్ధి, ఉపాధి కల్పనే ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర

బాలికల పాఠశాల భవనాలను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర

ప్రజాశక్తి- అరకులోయ : రాష్ట్రంలోని గిరిజనులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి వారికి ఉపాధి కల్పించడమే జగన్ నేతత్వంలోని వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందనిరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మంగళవారం మండలంలోని పాణిరంగిని పాడేరు ఐటిడిఎ కొత్తగా ఏర్పాటు చేసిన హెచ్‌పి పెట్రోల్ బంక్ ను స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో పెట్రోలు, డీజిల్ కోసం మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఈ సమస్య అధిగమించేందుకు మండలానికి ఒక పెట్రోల్ బంకును మంజూరు చేశారన్నారు. అరకులోయ నియోజకవర్గ పరిధిలో ఆరు పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసినట్లు తెలిపారుపెట్రోల్ బంకులో స్థానిక గిరిజనులకే ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

అనంతరం ఎండపల్లివలసలో పంచాయతీ సర్పంచ్ పెట్టెలి సుస్మిత, సభ్యులు షేక్ యాసిన్ ఆధ్వర్యంలో వైసిపి జెండాను ఆవిష్కరించారు. గిరిజనులు థింసా నత్యాలతో మంత్రి రాజన్న దొరను, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను సాదరంగా స్వాగతం పలికారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర, జీసిసి చైర్మన్ స్వాతిరాణి, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్, ట్రైకర్ చైర్మన్ బుల్లిబాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చెట్టి వినయ్, మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్ రాజా రమేష్, పాడేరు ఐటిడిఎ డిడి కొండలరావు, గిరిజన సంక్షేమ శాఖచీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సిఐ జిడిబాబు, ఎస్ఐలు సంతోష్, రాము ఆధ్వర్యంలో పోలీసు భద్రత కల్పించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

డుంబ్రిగూడ:నాడు నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను జగన్మోహన్‌రెడ్డి తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం, గిజన సంక్షేమ శాఖ మంత్రి పిడిక రాజన్న దొర అన్నారు. మంగళవారం స్థానిక జైపూర్ జంక్షన్‌లో నాడు నేడు నిధులతో నూతనంగా నిర్మించిన కిల్లోగుడా గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాల భవనాలను స్థానిక ఎమ్మెల్యే పాల్గుణతో కలిసి ప్రారంభించారు.

ప్రోటోకాల్ పాటించలేదని జెడ్‌పి చైర్‌పర్సన్ ఆగ్రహం

ఏజెన్సీలో ప్రభుత్వపరంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో జిల్లా పరిషత్ చైర్మన్‌గా, జిల్లా ప్రథమ పౌరురాలిగా తాను పాల్గొనేందుకు అధికారుల నుంచి ప్రొటోకాల్ ప్రకారం తనకు ఆహ్వానాలు అందకపోవడంపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మండిపడ్డారు. గిరిజన ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాల, అరుకులో పెట్రోల్ బంకు ప్రారంభోత్సవాలకు తనను ఎందుకు ఆహ్వానించలేదని ఉపముఖ్యమంత్రి రాజన్నదొర సమక్షంలోనే నిలదీశారు. దీనిపై కలెక్టర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు

సుధబాబు ఆశయాలను కొనసాగిస్తాం

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కిరణ్, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఎటపాక

సీపీఎం మండల నాయకులుగా పని చేసిన కామ్రేడ్ సుధబాబు ఆశయాలను కొనసాగిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. మండలంలోని మురుమూరులో సుధబాబు 3వ వర్ధంతి సభ కాకా అర్జున్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముందుగా పార్టీ జెండాను పార్టీ జిల్లా కార్యదర్శి కిరణ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో రెండో పంటగా చెప్పుకునే తునికాకు సేకరించే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన పోరాటాల్లో సుధబాబు కీలక పాత్ర పోషించారని తెలిపారు. పోలవరం నిర్వాసితుల తరపున పోరాడి జైలు జీవితం గడిపారన్నారు. నిర్వాసితులను ముంచేసే పోలవరం వద్దని నాడు చేసిన పోరాటాన్ని కొనసాగిస్తూ పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ నిర్మాణానికి సుధబాబు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు పులుసు బాలకృష్ణ, ఐ.పద్మ, సోయం వీరమ్మ, పొడియం రత్తమ్మ, జి.హరనాథ్, ఎ.నాగేంద్ర, ఆసు ప్రసాద్, సుధబాబు భార్య హేమలత, కుమారుడు రాజా పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన

పెండింగ్ వేతనాలు చెల్లించాలని

ప్రజాశక్తి -చింతూరు

ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

చింతూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులకు 6 నెలల నుంచి 11 నెలల పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. అనంతరం సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని సర్పంచ్‌కు, కార్యదర్శికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ప్రతిరోజూ చింతూరు పట్టణంతో పాటు ఎర్రంపేటలో పారిశుధ్య పనులు చేసి దుర్వాసన నుండి జనాలను కాపాడుతున్న కార్మికులను చిన్నచూపు చూడటం దుర్మార్గమన్నారు. కొంత మందికి 11 నెలలు, మరికొందరికి 9 నెలలు, మరి కొంత మందికి 6నెలల నుంచి జీతాలు చెల్లించలేదని, దీంతో వారి కుటుంబాలు పస్తుంటున్నాయని, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు.

పిడతమామిడితో 'గడపగడపకు మన ప్రభుత్వం'

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గంగవరం మండలం, పిడత మామిడి గ్రామ సచివాలయం పరిధిలోని వేములవాడ, పిడత మామిడి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి మంగళవారం చేపట్టారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో సుస్థిరమైన అభివృద్ధి సాధించాలంటే మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం ఎంపీపీ, జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, ఎంపిటీసీలు, సర్పంచులు, మండల కన్వీనర్, కోఆప్షన్ మెంబర్, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెసి శివ శ్రీనివాస్

రైతు సమస్యలపై దృష్టి

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి - అడ్డతీగల

ఏజెన్సీలోని గిరిజన రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని బొడ్లంక గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు అనంతరం గ్రామస్తులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కోత దశలో ఉన్న వరి పంటను ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి దళారుల ప్రమేయం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులంతా వినియోగించుకోవాలని సూచించారు. అమ్మిన పంటకు డబ్బులను ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలోనే జమ చేస్తున్నట్లు చెప్పారు. మ్యూటిషన్ విధానాన్ని సద్వినియోగం చేసుకొని పట్టాదారు పాస్ పుస్తకాలు పొందాలన్నారు. గిరిజన రైతులంతా సమగ్ర భూ సర్వేకు సహకరించి తమ భూముల హద్దులను ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయంలో జరుగుతున్న కార్యక్రమాలు, సిబ్బంది పనితీరుపై తహశీల్దారు శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోనం రాఘవ వీఆర్వో వెంకయ్యమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధితో వైసిపి నేత మృతి

ప్రజాశక్తి -రాజవొమ్మంగి

భీమిరెడ్డి జనార్ధన్ (ఫైల్‌ఫొటో)

ఇటీవల పిచ్చికుక్క దాడి చేయగా తీవ్రంగా గాయపడిన వైసిపి నేత భీమిరెడ్డి జనార్ధన్ (38) రేబీస్ వ్యాధి సోకి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మండలంలోని వాతంగి సర్పంచ్ భీమిరెడ్డి భవాని భర్త జనార్ధన్‌పై అక్టోబర్ 27న తన ఇంటి వద్ద పిచ్చుకుక్క ఆకస్మికంగా దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు ఆయన్ను తొలిత జడ్డంగి పీహెచ్సీకి తరలించగా వైద్యాధికారి సుజీ ప్రథమ చికిత్స నిర్వహించి, కుక్క కాటుకు సంబంధించిన ఇంజక్షన్ కూడా ఇచ్చారు. జనార్ధన్ కుక్కకాటుకు సంబంధించిన కోర్సు మొత్తం వాడారు. ఈనెల 20న జనార్ధన్‌కు వాంతులు అవడంతో పాటు జ్వరం తీవ్రంగా రావడంతో జడ్డంగి పీహెచ్సీకి తీసుకురాగా వైద్యాధికారి సుజీ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందారు. జనార్ధన్ మృతి పట్ల ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, వైస్ ఎంపిపి జుర్ర రాజేశ్వరి తదితరులు సంతాపం తెలియజేశారు. జనార్ధన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాలు

గిరిజన చట్టాలను పరిరక్షించాలి

ప్రజాశక్తి- అరకులోయ : గిరిజన చట్టాలు, హక్కులు పరిరక్షించాలని, అరకులోయలో గిరిజనుడు నిర్మించుకున్న విజయ విలాస్ లాడ్జి కూల్చివేతకు పంచాయతీ అధికారులు ఇచ్చిన నోటీసులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాత్రి ఏపి గిరిజన సంఘం, వివిధ ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. విజయ విలాస్ కూల్చివేస్తామని పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేయడం వెనుక బలమైన గిరిజనేతర శక్తుల ప్రోత్సాహం, కక్షపూరిత చర్యలు ఉన్నాయన్నారు. విజయ విలాస్ కు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. విజయ విలాస్ లాడ్జి నుంచి అరకులో అంబేద్కర్ జంక్షన్ మీదుగా టౌన్‌షిప్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ అధికారుల తీరుపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర,వివిధ ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, గిరిజన, కార్మిక సంఘాలనాయకులు వి. త్రినాధరావు, కొర్రా రవి, పొద్దు బాలదేవ్, చట్టు మోహన్, నందో, సాంబ, రాజ్ కుమార్, మహేష్, రామన్న, గంగరాజు, అశ్వధ, చిన్న బాబు, మండి నాగేశ్వరరావు, అడ్వకేట్ శ్రీనివాస్, దురియా సాయిబాబా వంతల పాల్గొన్నారు.

పట్టాలతో లబ్ధిదారులైన గిరిజన రైతులు

58 మందికి కొండపోడు పట్టాలు

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దొరగుడా, జబద గ్రామాలలో 58 మందికి అటవీ హక్కుల పట్టాదార పాస్ పుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ 2006 అటవీ హక్కు చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని గిరిజన సంఘం, సిపిఎం పోరాటాల ఫలితంగా నేడు సాగుదారులకు పట్టాలు అందడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ పట్టాలు ద్వారా రైతు భరోసా, పంటరుణాలు, ఇతర లబ్ధి చేకూర్చాలని కోరారు. అటవీ హక్కు పట్టాలు పొందిన గిరిజనులకు ప్రభుత్వపరంగా కాఫీ, సిల్వర్‌ఓక్, జీడిమామిడి తదితర మొక్కలు పంపిణీ చేసి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు కార్యక్రమంలో సుబ్బారావు గురుమూర్తి, తిరుపతి, లోకనాథ్, వార్డు సభ్యులు ఎస్ సోద, నిరి కృష్ణ, గణపతి పాల్గొన్నారు.

అన్ని పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - పెదబయలు రూరల్ :జిల్లాలోని అన్ని యాజమాన్యాలలోని ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించాలని జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావు కోరారు. పాఠశాలల స్థాయిలో ఈ నెల 22,23 తేదీల్లోనూ, మండల స్థాయిలో వచ్చేనెల 27,28 తేదీల్లోనూ, రాష్ట్రస్థాయిలో ఫిబ్రవరి 27,28 తేదీల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించాలని విద్యాశాఖ నిర్దేశించిందన్నారు. ఆయా పాఠశాలల్లోని హెచ్ఎంలు నిర్వహణ బాధ్యతలను చేపట్టాలని, డిప్యూటీ డిఇఒలు నోడల్ అధికారులుగా పర్యవేక్షిస్తారన్నారు. జిల్లా స్థాయిలో డిఇఒ దీన్ని నిర్వహణ బాధ్యతలు చూస్తారన్నారు. సైన్స్ ఫెయిర్‌లో భాగంగా ప్రతి ఉన్నత పాఠశాల స్థాయిలో ఒక్కో అంశం నుంచి ఒకటి చొప్పున ఐదు ఉత్తమ ప్రాజెక్టులు ఎంపిక చేసి మండల స్థాయి ప్రదర్శనకు పంపాలని, మండలస్థాయిలో ఐఉ ఉత్తమ ప్రాజెక్టులను గుర్తించి జిల్లాస్థాయికి పంపాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయిలోరెండుఉత్తమ యూనిట్లను గుర్తించి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు పంపిస్తారన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి -అనంతగిరి : ప్రజాసమస్యలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు, వివరణలు ఇచ్చి, తగు పరిష్కార చర్యలు చేపట్టాల్సిన అధికారులు గైర్హాజరైతే మండల సమావేశాలు నిర్వహించి ప్రయోజనమేమిటని జెడ్‌పిటిసి దీసరి గంగరాజుతోపాటు పలువురు సభ్యులు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపికి శెట్టి నీలవేణి అధ్యక్షతన జరిగిన మండల సమావేశం ఆద్యంతం వాడీవేడిగా సాగింది. అధికారుల గైర్హాజరు అభివృద్ధికి ఆటంకం కాక మరేమిటని పలువురు ప్రశ్నించారు. అటవీశాఖ రేంజర్ కార్యాలయాన్నిమండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని, ప్రతి మండల సమావేశానికి ఫారెస్ట్ అధికారులు విధిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. విజయనగరం జిల్లా ఎస్‌కోటలో అటవీ రేంజర్ కార్యాలయం ఉంటే ఇక్కడి సమస్యలకు పరిష్కార చర్యల్లో జాప్యమౌతోందని ఆవేదన వెలిబుచ్చారు. అనంతగిరి పంచాయతీ రాజుపాక నుండి డెక్కపురం, హుకుంపేట మండలం పటకదౌవడ వరకు మంజూరైన రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతులు ఇవ్వకుండా అభ్యంతరం పెట్టడం సరికాదని, దీనిపై డిఎఫ్ఒ స్పందించి తక్షణమే అనుమతులు జారీకి చర్యలు చేపట్టాలని కోరారు. రొంపల్లి పంచాయతీ కారకవలసలో విద్యుత్ లైన్ ఏర్పాటుకు, పెద్దబిడ్డ, చెరుకుమడ గ్రామం వద్ద కొండచరియల ముప్పు ఉందంటూ ఇళ్ల నిర్మాణాలకు అటవీఅధికారులు అడ్డుచెప్పడంపై ప్రశ్నించారు.దీనిపై అటవీశాఖ గార్డు దురుసుగా సమాధానమివ్వడంపై సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేసి నిలదీశారు. అటవీశాఖ కిందిస్థాయి సిబ్బందిని సమావేశానికి పంపి చేతులు దులుపుకోవడమే కాకుండా, వచ్చిన వారి వద్ద కనీస సమాచారం లేకపోగా, సభ్యుల పట్ల దురుసుగా ప్రవర్తించడం సరికాదని, వెంటనే సంబంధిత గార్డును మండల సభను బయటకు పంపేయాలని, అటవీ రేంజర్ వచ్చి సమాధానం చెప్పేలా చర్యలు తీసుకోవాలని సభ్యులంతా కోరారు. గర్భిణులు, బాలింతల మరణాలపై మండల సభలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు కె.మొస్య ఎస్.రూతు, కె.అప్పారావు ఎంపిడిఒ హర్షిత్, వైద్యాధికారి జ్ఞానేశ్వరి పాల్గొన్నారు

అధికారుల గైర్హాజరుపై సభ్యుల మండిపాటు

అటవీ ఉద్యోగిని నిలదీస్తున్న మండల సభ్యులు

మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం.శ్రీను

నిషేధాజ్ఞలపై గిరిజన సంఘం నిరసన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో ప్రవేశాలపై నిషేధాజ్ఞలు విధిస్తూ గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి కాంతిలాల్ దండే జారీ చేసిన ఉత్తర్వులపై నిరసనలు వ్యక్తమౌతున్నాయి. గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం.శ్రీను మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఇతరుల ప్రవేశం వద్దంటూ ఉత్తర్వులు జారీచేయడంలో ఉన్న చొరవ, పాఠశాలల్లోని సమస్యల పరిష్కారం, సౌకర్యాల కల్పనలో చూపితే సరిపోయేదని మండిపడ్డారు. అల్లూరి జిల్లాలోని 22 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో సమస్యలు తిష్టవేసి ఉన్నాయని, విద్యార్థులు మెనూ అమలుతోసహా అన్ని సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతుంటే, వాటిని వెలికితీస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాన్ని పాఠశాలల్లోకి వెళ్లొద్దంటూ ఉత్తర్వులు జారీ చేయడంపై మండిపడ్డారు. పాడేరు-1 ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి అనుమానస్పద మృతిపై విద్యార్థి సంఘాలు ప్రశ్నించడం తప్పా అని ఎండగట్టారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది కొరతతోపాటు బోధన, మెనూలో వైఫల్యాలపై విద్యార్థిసంఘంతోపాటు ఎవరైనా సమస్యను బయటపెడితే వాటిని పరిష్కరించాలని కోరారు. నిషేధం ఎక్కువౌతున్న కొలదీ సమస్య పరిష్కారానికి ఉద్యమాలు, ఒత్తిళ్లు ఎక్కువవుతాయనే విషయాన్ని గమనించి, వెంటనే ప్రవేశాలకు అనుమతులంటూ జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, అన్ని సమస్యలను పరిష్కరించడంతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టి నాణ్యమైన విద్యను గిరిబాలలకు అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు రామదాసు, సొడోనో, గోవిందు, గిరిజన సంఘం నాయకులు గణపతి, నర్సింగ్ పడాల్ పాల్గొన్నారు.

కార్మికుల కంటే కార్పొరేట్లే ముఖ్యమా..!

ప్రభుత్వాల తీరుపై సిఐటియు ధ్వజం

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఉమామహేశ్వరరావు

పజాశక్తి -పాడేరు : కార్మికుల సంక్షేమం కంటే కార్పొరేట్ కంపెనీల లాభమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ముఖ్యమని, కార్మిక వర్గం కోసం కాకుండా వాటి కోసమే ఈ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధానకార్యదర్శి ఉమామహేశ్వరరావు విమర్శించారు.మంగళవారం చింతపల్లిలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన మండలంలో వివిధ రంగాల కార్మికుల విస్తృతస్థాయి సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వచ్చేనెల 20, 21తేదీల్లో అల్లూరు జిల్లా మొదటి మహాసభ జరగనుందని, కార్మికులంతా హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు, ఇతర సమస్యలతోపాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి కదలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జీకే వీధి మండల నాయకులు గడుతూరి సత్యనారాయణ, వైటిసి యూనియన్ ప్రతినిధి వేములపూడి రామకృష్ణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి పాంగి పెంటమ్మ, మధ్యాహ్నం భోజన కార్మికుల జిల్లా అధ్యక్షులు పసుపులేటి లక్ష్మి, పద్మ, పార్వతి, ఆశ యూనియన్ నేత కించే కొండమ్మ, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నేత కేసు బాబు, పంచాయతీ కార్మికుల సంఘం నాయకుడు నూకరాజు పాల్గొన్నారు,

రాజన్నదొరకు వినతిపత్రం ఇస్తున్న భాషా వాలంటీర్లు

మాతృభాషా వాలంటీర్లకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : మాతృభాషా వాలంటీర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, మంగళవారం పెట్రోల్ బంక్ ప్రారంభానికి వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పిడిక రాజన్న దొర, జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్రకు వినతిపత్రం ఇచ్చారు. తమను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని భాష వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు పాంగి కుమారి విన్నవించారు. దీనిపై ఉపముఖ్యమంత్రి రాజన్నదొర స్పందిస్తూ మాతృభాషా వాలంటీర్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం నాయకులు వి.బొంజుబాబు, కిల్లో వీరయ్య, సీదరి చిట్టిబాబు, వి.చంద్రయ్యఉన్నారు.

పెట్రోల్ బంక్ సర్వీస్ ప్రొవైడర్ల కోసం 24 వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పెట్రోల్ బంకుల్లో సర్వీసు ప్రొవైడర్ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 24వరకు పొడిగించినట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఆర్.గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 24వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

సిఐటియు మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : స్థానిక కల్యాణమండపంలో సిఐటియు మండల మహాసభలు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలఅధ్యక్ష కార్యదర్శులుగా సీసా విజయ, కొర్ర శంకరరావుతోపాటు మరో 13మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ, కార్మికుల హక్కులు, సంక్షేమానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. విద్యుత్ రంగం, విఒఎలు, విఆర్ఒలు, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, ఇతర అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

శంకరరావు, విజయ

వృక్ష సంయుత, వెద వరి సాగు లాభదాయకం

ప్రజాశక్తి-రంపచోడవరం : వృక్ష సంయుత, వెద వరి సాగు పద్ధతులు రైతులకు లాభదాయకమని రంపచోడవరం కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త లలిత కామేశ్వరి అన్నారు. మండలంలోని పెద్దూరులో ఐటిసి బంగారు భవిష్యత్తు వారి సహకారంతో, సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రోత్సాహంతో రైతులు చేయిస్తున్న వృక్ష సంయుత, వెద వరి సాగు వ్యవసాయ విధానాన్ని లతిత కామేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర పంటలు, భూసార పరీక్షల పట్ల అవగాహన కల్పిస్తూ ఒకే భూమిలో రెండు రకాల పంటలు పండించేలా రైతులను ప్రోత్సాహిస్తున్న స్వరాజ్ సంస్థ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోసు బుచ్చన్న దొర, ఎంపిటిసి కోసు బాపనమ్మ, సొసైటీ పర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ గణేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ నాగేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సచివాలయం వద్ద మంగళవారం సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన రాజవొమ్మంగి గ్రామంలో ఉన్న అన్ని రంగాల వ్యాపారస్తులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జి రమణి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, దుకాణదారులు, ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం, కోళ్ల వ్యర్థాలు, రోడ్లపై విచ్చలవిడిగా వేయకూడదని సూచించారు. ఎవ్వరైన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.మల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పలువురు దుకాణదారులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు శాఖ గ్రంథాలయంలో 55వ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, సర్పంచ్ కారం కన్నారావు, హైస్కూల్ హెచ్ఎం లక్ష్మణరావు, స్కూల్ అసిస్టెంట్ సుబ్బయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు చదివి ఉత్తమ విజ్ఞానవంతులుగా తయారు కావాలనే సూచించారు. గ్రంథాలయం వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.గోవిందరాజులు, బీడీసీ సిబ్బంది, జారే ప్రేమ్ కుమార్, ఎం.లలిత పాల్గొన్నారు.

ఉపాధి హామీ జాబ్ కార్డులపై అవగాహన

ప్రజాశక్తి - సీలేరు : జాతీయ ఉపాధి హామీ చట్టం జాబ్ కార్డుల ఉపయోగాలపై జీకే వీధి మండలం, సీలేరు గ్రామపంచాయతీలో గిరిజనులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ రామ్మూర్తి మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్ కార్డు లేని వారు దరఖాస్తులు చేసుకొని పొందాలని సూచించారు.

జాబ్ కార్డులు ఉండి రద్దయినట్లయితే సచివాలయంలో దరఖాస్తు చేస్తే మళ్లీ మంజూరు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, పంచాయతీ పరిధిలోని చంద్రుపల్లి, లైకాన్‌పూర్, చింతపల్లి క్యాంపు, సీలేరు, టిఆర్‌సి గిరిజనులు పాల్గొన్నారు.

గిరి మహిళలకు అండగా 'దిశ' ఫౌండేషన్

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : గిరిజన మహిళలకు న్యాయం చేయడం కోసం దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ నిరంతరం కృషి జరుపుతోందని ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు సమర్థి గులాబి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని వసుంధర రెస్టారెంట్‌లో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా కార్యవర్గ పదవి స్వీకారోత్సవం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు స్వాతి వర్మను ఘనంగా సత్కరించారు.

రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : విశాఖ, కిరండల్ రైల్వేలైన్‌లో అరకు స్టేషన్‌దరి అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద పడి గుర్తు తెలియని వ్యక్తి వ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందినట్లు ఆర్‌పిఎఫ్ ఎస్ఐ రవి వర్మ తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలంలో చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. మృతుడు ఎవరన్నాది తెలియాల్సి ఉందని, రైల్వే ట్రాక్‌పై ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేసి రైల్వే ట్రాక్‌పై పడేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు

సమస్యలపై యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగమణి, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, తాడాన అప్పారావు, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.లక్ష్మి, గొంది చినబ్బాయి, అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విల్సన్ బాబు, పి.మహేష్ మీడియాతో మాట్లాడుతూ పిఎఫ్ బకాయిలు (లోన్లు క్లోజర్స్), డిఎ బకాయిలు చెల్లించాలన్నారు. సిపిఎస్ బకాయిలు, పిఆర్‌సి డిఎ బకాయిలను తక్షణమే ఇవ్వాలన్నారు. ఎపిజిఎల్ఐ, లోన్లు, క్లోజర్స్ జాప్యాన్ని నివారించాలన్నారు. సరెండర్ లీవ్ బిల్లులను చెల్లించాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - అడ్డతీగల : మండలంలోని వేటమామిడి పంచాయతీ పరిధి హోసన్న ఇంగ్లీష్ మీడియం స్కూలుకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.ధన సందీప్, పిఇటి కంచు సువర్ణ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అండర్-14 ఫుట్‌బాల్ సెలక్షన్‌లో తమ పాఠశాల నుంచి అభిషేక్, వరుణ్, విజయ్, షటిల్ బ్యాడ్మింటన్‌కు మిరియాల చిన్నారులదొర, కలుముల ఐశ్వర్య ఎంపికైనట్లు వారు తెలిపారు. ఆటల పోటీలకు విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల డైరెక్టర్ దేనియల్ సందీప్, విద్యాశాఖ అధికారి మల్లేశ్వరరావు అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - కూనవరం

అంగన్వాడీ కార్యకర్తలను సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ఏప్రిల్ నుండి పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ప్రాజెక్ట్ మీటింగ్ నిర్వహించాలన్నారు. మెటీరియల్ ట్రాన్స్‌పోర్టు బిల్లులు ఏప్రిల్ నుండి ఇప్పటికి వరకు ఇవ్వడం లేదని తెలిపారు. 2017 నుండి డిఎ, డిఎలు లేవన్నారు. గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే ఇవ్వాలని, వరదలలో నష్ట పోయిన సెంటర్లకు ఫర్నిచర్ ఇవ్వాలని కోరారు. కార్యకర్తలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని. సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన సిడిపిఒ సమస్యల పరిస్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమరం పెంటయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, సుధారాణి, పూనెం సత్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిడిపిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

చురుగ్గా సాగుతున్న పనులు

చురుగ్గా కల్వర్టు, రహదారి నిర్మాణ పనులు

ప్రజాశక్తి- సీలేరు : జీకే వీధి మండలం సీలేరు-దుప్పిలివాడ పంచాయతీ పరిధి చల్లని శిల్ప మధ్య గల ప్రధాన రహదారిలో కల్వర్టు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పాలగెడ్డ-ఆర్‌వి.నగర్ మధ్యగల బిటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారి టెండర్లు ప్రక్రియ గతంలోని పూర్తయినప్పటికీ వర్షాభావ పరిస్థితులు, కొన్ని సాంకేతికపరమైన ఇబ్బందులతో రహదారి, కల్వర్టు పనులు నిలిచిపోయాయి. ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు రహదారి పనులు తక్షణమే చేపట్టాలని అఖిలపక్షాల ఆధ్వర్యంలో గతంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. జిల్లా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి కూడా ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత కాంట్రాక్టర్‌తో రహదారి పనులు చేపట్టే విధంగా ఆర్ అండ్ బి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దారకొండ ఘాట్ రోడ్డులో ప్రమాదపు మలుపుల వద్ద సిసి రోడ్లు నిర్మాణం పనులు కూడా చేపట్టారు. ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు బిటి రోడ్డు, కల్వర్టు పనులు పూర్తయితే రవాణా సౌకర్యంతో పాటు వాహనచోదకుల కష్టాలు తీరనున్నాయి.

పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

తాగునీటి పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని చిన్న మట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను స్థానిక ఎంపీటీసీ ప్రదీప్ కుమార్, సర్పంచ్ పిట్టా రామారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ నిధుల నుండి చిన్నమట్టపల్లి గ్రామ పంచాయతీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సౌకర్యం కల్పించేందుకు ఈ పైపులైన్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలోని చింతరేగుపల్లి గ్రామంలో సుమారు 500 మీటర్ల పొడవునా పైపులైన్ వేశామన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆ కార్యక్రమంలో కోటం జయరాజు, ఆర్‌బికె చైర్మన్ ముత్యాల మురళి, సొసైటీ అధ్యక్షులు మడకం శారద, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గూటాల ముత్యాలరావు, బాగుల మురళి పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మాంసం దుకాణదారులు ఎవరైనా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా పారవేస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎంపీడీవో కె.బాపన్న దొర హెచ్చరించారు. మంగళవారం జడ్డంగి, రాజవొమ్మంగి శివార ప్రాంతాల్లో కార్యదర్శులు మల్లేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో వ్యర్థాలను తొలగించారు. ఇకపై మాంసం, చేపలు దుకాణదారులు స్వయంగా చెత్తాచెదాలను తగలబెట్టాలని, లేకుంటే గోతులు తీసి పూడ్చాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.